# కూలిపోయిన వ్యక్తి

-టి. షణ్ముఖరావు

ఆ ప్రైవేటు బస్సు షెడ్‌లో లేనప్పుడు శ్రీకాకుళానికీ— కొత్తూరుకి మధ్య తిరుగుతుంది. అది కదిలితే రైలింజను శబ్దం వస్తుంది. ఆగితే మళ్ళీ కదలడానికి గంట పడుతుంది.

బస్సు లోపలి భాగంలో ఎన్నో స్లోగన్లు వ్రాసి ఉన్నాయి. 'పొగ త్రాగరాదు'. 'ఇంజనుపై కాళ్ళు పెట్టరాదు'. 'దేవుని స్మరించుము'. 'బస్సు ఆగనిదే దిగరాదు'. ఇలాంటివి ఇంకెన్నో. అందులో ఏ ఒక్కటీ ఎన్నడూ పాటించడం జరగదు.

ఆ బస్సులో ఉన్న నలుగురు సిబ్బందిలో కండక్టరు నరసయ్య ఒకడు.

బస్సు ఓనరు శ్రీకాకుళం నివాసి, గవర్రాజు.

ఆ రూట్లో పని చేసి రెండేళ్ళ క్రితం— బదిలీ అయి వెళ్ళిన బ్రేక్ ఇన్‌స్పెక్టరు నరసింహంగారు మళ్ళా బదిలీ అయి ఇక్కడికే వచ్చారనీ, నిన్ననే జాయినయ్యారనీ ఇప్పుడే అందరికీ తెలిసింది.

* * *

ఇప్పటికి సుమారు రెండేళ్ళ క్రితం— షావుకారు గవర్రాజుగారు తన ఇంటికి ఏభై గజాల దూరంలో ఉన్న రిపేర్ షెడ్ ముందర మర్రిచెట్టు నీడలో పేము కుర్చీలో కూర్చుని సిగరెట్ పీలుస్తూ, డ్రైవర్లూ, కండక్టర్లూ, క్లీనర్ల సమక్షంలో కులాసాగా కొలువు తీరి టీ చప్పరిస్తున్నారు. ఆయన నల్లని ఆకారానికి తెల్లని పంచె, లాల్చీ చీకటి చుట్టూ వెన్నెల ప్రాకుతున్నట్టు తమాషాగా ఉన్నాయి. అక్కడా అక్కడా తెల్లబారి పైకి దువ్విన జుత్తూ, దానికి ముదుట బొట్టు కూడా చిత్రంగానే అమిరాయి. ఆ సమయంలో వారు నిబ్బరంగా చిన్న చిరునవ్వు కూడా జోడించి నలుగురి ఎదుటా మెప్పికోలు కోసం మాంసం ముట్టనని ప్రమాణం చేసిన పులి 'పచ్చిగడ్డి తినడ మెలాగా?' అని ఆలోచిస్తున్నట్టు కాస్త పరధ్యానంగానూ, ఇంకాస్త ప్రశాంతంగానూ కనుపిస్తున్నారు. తన సిబ్బంది ఇతర బస్సు యజమానుల 'తీరని' ని బూతులు తిట్టి పోస్తున్నప్పుడు, సరదా తోనే ఒకటీ అరా మందలిస్తున్నారు. మర్యాదనీ బోధిస్తున్నారు.

సరిగ్గా ఆ సమయంలో బ్రేక్ ఇన్‌స్పెక్టరు నరసింహంగారి ప్యూను వీరాసామి వచ్చేసి, వంగి సలాం చేసి వినయంగా నిలుచున్నాడు.

గవర్రాజుగారు గంభీరంగా -"ఏటోయ్ ఇలా వచ్చావ్?" అనడిగారు.

"తమ దర్శనానికే, బాబూ!" అన్నాడు ప్యూను వంకర్లు పోతూ.

"ఏమా అయ్యగారు బావున్నారా?" అని కుశల ప్రశ్న వేశారు.

కుశల ప్రశ్న విని వెకిలిగా నవ్వాడు వీరాసామి.

అది చూసి చిరాగ్గా మొహం పెట్టారు గవర్రాజుగారు.

"తమకి తెలీదేటి, బాబూ! అయ్యగారికి బదిలీ అయిపోయింది. రేపే ఎళ్ళిపోవాలట."

"అరెరె! నాకు తెలీదే!" నిజంగానే ఆశ్చర్యపోయారు గవర్రాజుగారు.

"సామాను తీసుకెళ్ళడానికి తమని రెండు లారీ లిమ్మన్నారు, బాబూ!" అని గుక్క తిప్పుకోకుండా చెప్పేశాడు వీరాసామి.

వీరాసామిలో మనిషికి ఉండవలసిన రోమాన్సు చచ్చిపోయింది. శరీరం మాత్రం బతికి ఉంది. ఆరోగ్యమూ, ఆలోచనా అప్పుడెప్పుడో సర్వీసు ప్రారంభంలోనే వదిలేసినట్టున్నాడు. ఇప్పు డత డొక యంత్రం. జీతం తీసుకెళ్ళి పెళ్ళాం చేతిలో పెడతాడు. ఆకలేస్తే తింటాడు. పిల్లి లేడిస్తే తుమ్ముతాడు. బ్రేక్ ఇన్‌స్పెక్టరు చెప్పిందల్లా చేస్తాడు. కండక్టర్లకీ, డ్రైవర్లకీ చెయ్యి చాస్తాడు.

గవర్రాజుగారు ఒక్క నిమిషం ఆలోచించారు. "రెండు లారీలు కావాలా? రెండు ఖాళీ ఉండవు. ఒకటే ఉంటాది. కావాలంటే తీసుకెళ్ళమను. అదీ రిపేర్లో ఉంది. రేపటికి అందిస్తా నన్జెప్పు."

"అయ్యగారు రెండు కావాలన్నారే!" అని నాన్చేడు వీరాసామి.

"లేవంటే వినిపించడం లేదా?"

"జేగెల్లి అయ్యగారితో సెప్పొస్తాను" అనేసి బ్రేక్ ఇన్‌స్పెక్టరు ప్యూన్ వీరాసామి అనబడే ఏముకల గూడు వెనక్కి తిరిగి పోయింది.

"హమ్మయ్య! రక్షించాడోయ్. నరసింహంకి బదిలీ అయిపోయింది. బతికాం. మూడు సంవత్సరాలు ఇతగాణ్ణి మేపితే సరిపోయింది నా పని. కూతురి పెళ్ళికి బస్సు కావాలంటాడు. రాయి తేవాల లారీ ఇమ్మంటాడు. షికా రెళ్ళాల కారిమ్మంటాడు" అన్నారు గవర్రాజుగారు, సిగరెట్ నుసి రాలుస్తూ.

"గొప్పోడు, బాబూ! నోటు మూపిస్తే కాని నోరు కదిపేవాడు కాడు" అన్నాడొక డ్రైవరు.

"రెండు లారీలు కావాలట. తాతగారి వసుకున్నాడు గావాల. బదిలీ అయిపోయింది. ఈడి మొహమాటం మన కేటి?" అన్నా డొక కండక్టరు.

క్రింద వాడు పైవాణ్ణి ఎప్పుడూ శత్రువులా చూస్తాడు. వీలు చిక్కితే ఆ కసి ఏ విధంగానైనా తీర్చుకోవాలనుకుంటాడు. అసహ్యాన్ని అవకాశా మున్నప్పుడల్లా ప్రదర్శించుకుంటాడు.

"ఏదో తమరు కాబట్టి ఒకటైనా ఇస్తా మన్నారు. ఇంకో డైతే కసిరేసే వోడు" అన్నా డో చెక్కరు.

"ఇన్నాళ్ళూ మేపిందీ సాల్దా? ఇంక లారీ ఎందు కివ్వాలంట?" అన్నా డో క్లీనరు.

ఈ విధంగా బ్రేక్ ఇన్‌స్పెక్టరు నరసింహంగారి పైన చర్చ ఒక గంట కొన సాగింది.

ప్యూను వీరాసామి మళ్ళీ వచ్చాడు. ఈ సారెందుకో నెర్వస్‌గా డబ్బు కోసం మొదటిసారి భార్యని తారుస్తున్న వాడిలా కనిపించాడు. వచ్చి కదలకుండా నిలుచున్నాడు.

గవర్రాజుగారు అతన్ని చూశారు.

"యీల్లేదు, రెండు లారీలే కావాలంటున్నారు, బాబూ! ఏటో ఆ బాబు యెర్రి, కాని, ఇంకోటి మరెవరి కైనా అడక్కూడదా!" బ్రేక్ ఇన్‌స్పెక్టరుకి బదిలీ అయిపోయింది. కాని, ప్యూను ఇక్కడే ఉంటాడు. అందుకని అతడికి గవర్రాజుగారి మొహమాటం పోకూడదు. అలాగని నరిసింహంగారికి కోపం రాకూడదు.

గవర్రాజుగారు కొంచెం నిర్లక్ష్యంగా చూశారు. 'శాంతంగా ఉండాలనుకున్న వాణ్ణి కదిలించి కోపం తెప్పిస్తున్నావోయ్' అన్నట్టు వీరాసామి వైపు చూశారు. మునికి సూదితో గుచ్చినట్టు చూశారు.

"లారీ ఒకటే ఉంది. ఇష్టమైతే తీసుకెళ్ళమను. లేకపోతే మానీమను. నా కొంపేం మునిగిపోలేదు."

"ఆరు లారీ లుండాల. రెండు ఖాళీ లేవా? అంటున్నా రండీ అయ్యగారు."

"ఈ సారి ఒకటికూడా లేదన్జెప్పు. బేగెల్లు" అనేసి, గవర్రాజుగారు గంభీరంగా లేచి ఇంటి వైపు నడక సాగించారు. వీరాసామి మరో పావుగంట నిలుచుని వెళ్ళిపోయాడు.

* * *

అది జరిగిన సంవత్సరం తరవాత— ఆ రోజు సాయంత్రం ఆరు గంటలయింది. గవర్రాజుగారు అదే కుర్చీలో అలాగే సిగరెట్ కాలుస్తూ, టీ తాగుతూ కూర్చున్నారు. ఇంతలో ఆ రోజే కొత్తగా పనిలో చేరిన కండక్టరు నరసయ్యా, చెక్కరు గుర్నాథం పోట్లాడుకున్నారని వార్తొకటి వచ్చింది.

ఇద్దర్నీ పిలుచుకుని రమ్మని ఓ క్లీనర్ని ఆదేశించారు.

మరో అరగంట తరవాత కండక్టరు నరసయ్యా, చెక్కరు గుర్నాథం రంగం మీది కొచ్చారు.



"ఏటయిందోయ్?" అని గవర్రాజు గారు చెక్కరు గుర్నాధాన్ని ప్రశ్నించారు.

గుర్నాధం వయస్సులో పెద్దవాడే. కాస్త శాంతమూ, మంచితనమూ ఉన్నవాడే. బస్సుల్లో బాగా అనుభవమున్నవాడే. తోటి పనివాళ్ళ మీద సానుభూతి కలవాడే. కాని, స్వామి భక్తికి లోకా లేనివాడు.

"ఏం లేదు, బాబూ! మన నరసయ్యా కండక్టరు లైసెన్సు పట్టుకొచ్చి వారం రోజులు కాలేదు గదా? లైన్లో సాదక బాధకాలు తెలీవు. అంతే. మరేం లేదు, బాబూ!" అని చెప్పాడు చెక్కరు.

"ఏటయిందో, యివరంగా సెప్పు" అన్నారు గవర్రాజుగారు.

నరసయ్యా ఏదో చెప్పబోయాడు.

కండక్టరు నరసయ్యా కుర్రవాడే. కాస్త చురుకుతనమూ, కళ్ళలో వెలుగూ, మాట పట్టుదలా ఉన్నవాడే. న్యాయం గురించి ఆలోచన ఉన్నవాడే కాని, వ్యవహారజ్ఞానం మాత్రం లేనివాడు.

అతన్ని చెక్కరు గుర్నాధం వారించాడు. "మరేం లేదు, బాబూ! బస్సు సీటింగు మీద నడిపిస్తా నంటాడు. ఓవర్ లోడ్ చెయ్యనంటాడు. కాదయ్యా, లాభం లేదు. పాసింజర్లొప్పుకోరు. ఇది స్టేట్ బస్సు కాదు, అంటే యినడు. ఇది, బాబూ, సంగతి" అని చెక్కరు గుర్నాధం పూర్తి చేశాడు.

గవర్రాజుగారు గంభీరంగా నరసయ్యా వైపు చూశారు. పాలు తాగుతున్న పులి పిల్ల మాంసం తింటున్న తల్లితో—

# జయతి

రమ్మోయి! నవవర్ష! రమ్మోయి! నల నామ!
స్వాగతమోయి! నిస్స్వార్థ చరిత!
ఎన్నాళ్ళ కెన్నాళ్ళ కెన్నేండ్లకోయి! నూ
తన వత్సరంబన్న తనువు పొంగె
ప్రతి గృహద్వారము పరిఫుల్ల సహకార
పల్లవ తోరణ భ్రాజియయ్యె
సమరీతి వీవగా సాగె నెల్లరపైన
చందనాద్రి సమీర సౌరభములు
పేద బ్రతుకులు రాక్షస స్వాదునేత
సగము పరిదిద్దె – మిగిలిన సగము నీవు
సరిగ జేయుదు వనెడి విశ్వాస దీప్తి
వేచి యున్నాము రమ్మ! మా వీథి వెంట.

—శనగన నరసింహస్వామి

---

'అమ్మా! జీవహింస పాపం కాదా!' అంటే తల్లి పులి ఎలా చూస్తుందో అలా చూశారు. చిన్నగా నవ్వారు.

ఆ నవ్వు చెక్కరు గుర్నాథం అజ్ఞానానికే అనుకొని, న్యాయం మెరుస్తున్న కళ్ళతో నరసయ్య మాట్లాడాడు—

"అవును, బాబూ! నిజవే. పాసింజర్లెక్కు కోరని మనం బస్సు ఓవర్ లోడ్ సేసే రూలుకి అడ్డంగా పోదామా సెప్పండి? అది న్యాయవేనా? ఎప్పుడైనా పట్టుకున్నారంటే నాకు రిమార్కు రాదా, బాబూ! ఇది ఎవల బస్సంటే, గవర్రాజు గారి బస్సని మీ గౌరవం పోదా, బాబూ!"

గవర్రాజుగారు నవ్వారు. ఇంకా... ఇంకా కుర్చీ విరిగి పోయేట్టు, మర్రిచెట్టు పడిపోయేట్టు నవ్వారు. సిశానీ బోపతు సాక్షి లా గురించి ఇచ్చిన ఉపన్యాసం విని లాయరు నవ్వినట్టుగా నవ్వారు.

ఆ నవ్వు అర్థంకాక నరసయ్య వెర్రి మొహం వేశాడు.

"నర్సయ్యా! నువ్వు సెప్పినవన్నీ బాగానే ఉన్నాయిరాయ్. అలాగే సెయ్యాలి. ఒన్ ఓవర్ లోడ్ సెయ్యకుండా సిటింగు మీద నడిపించాలి. బస్సుకి మంచి పేరు తేవాల!" అని గవర్రాజుగారు కొంచెం ఆగేసరికి చెక్కరు గుర్నాథం ముక్కు మీద వేలేసుకోబోయేంతలో మళ్ళా ఆయనే—"నేను మాత్రం చిప్పుచ్చుకోవాల!" అని పూర్తిచేసి వేలు తిప్పేశారు.

కండక్టరు నరసయ్యకి పిడుగు పడ్డట్టయింది.

"అదేటి, బాబూ! మీరూ... మీరూ..."

"అవునోయ్. నేనే... నేనే అంటున్నాను. బస్సు సిటింగు ప్రకారం నడిపిస్తే డబ్బు రాదు. సంవత్సరం తిరక్కుండానే సీ బస్సమ్మెయ్యాల. ఆ బస్సు లేకపోతే ఏమవుతావో నీకు తెల్దు. బస్సు మీద నాలుగు రాళ్ళొస్తేనే మనందరికీ దారుంటాది. నా వాదు, ఏ బస్సు ప్రొప్రయిటరునా అంతే సెప్తాడు."

"ఎప్పుడైనా పట్టుకుంటే నా లైసెన్సు..."

"నరక లైసెన్సు సీది. లక్ష రూపాయిల బస్సు నాది. మరేం ఫర్వేలేదోయ్. డ్యూటీ కెల్లు" అనేసి, గంభీరంగా లేచి ఇంటి వైపు నడక సాగించారు గవర్రాజు గారు.

కండక్టరు నరసయ్య మరి కొన్ని క్షణాలు అక్కణ్ణుంచి కదల్లేక పోయాడు.

అతడి మెదడులో ఎన్నో ఆలోచనలు—కొన్ని న్యాయం వైపు, కొన్ని ఆకలి వైపు, కొన్ని లైసెన్సు సంపాదించక ముందు కష్టాల వైపు, కొన్ని ఇక కుటుంబానికి దారి ఉంటుందన్న ఆశ వైపు, కొన్ని మంచి వైపు, కొన్ని చెడ్డ వైపు, కొన్ని గవర్రాజు గారివైపు, కొన్ని రూపు అధికారుల వైపు...

• • •

ఇప్పుడు—

గవర్రాజుగారి బస్సు కొత్తూరునుండి శ్రీకాకుళం పోతూంది.

బ్రేక్ ఇన్‌స్పెక్టరు నరసింహంగారు మళ్ళీ వస్తారంటే ఆయన సంగతి డ్రైవరుకీ, చెక్కరుకీ ముందే తెలుసు. తెలియందల్లా కండక్టరు నరసయ్యకే.

ఇప్పటికే బస్సు చాలా రద్దీగా ఉంది. శ్రీకూర్మంలో మహోదయం చూడ్డానికి జనం తండోపతండాలుగా పోతున్నారు.

కండక్టరు నరసయ్య టిక్కెట్లు జోరుగా బుక్ చేస్తున్నాడు.

ఓ చోట బస్సాగింది. డ్రైవరుకి ఎవరో కారియరు అందించారు. మరో చోట 'ఈ మందు పట్రా' అని చీటీ ఇచ్చారు. ఇంకో చోట 'అరిటిపళ్ళు పట్రా' అని డబ్బు లిచ్చారు. వేరొక చోట 'మన స్పీడరు కిచ్చే' అని ఉత్తరం ఇచ్చారు.

ఈ బస్సు స్టాఫంతా ఆ రూట్లో చుట్టుపక్కల గ్రామాల వాళ్ళకి-ముఖ్యంగా చిన్నా పెద్దా వ్యాపారస్థులకీ, ఛోటా బడా రాజకీయనేతలకీ, ఉద్యోగస్థులకీ, కోర్టు పక్షులకీ, పట్నంలో లాడ్జీలు మరిగిన ఆడవాళ్ళకీ, సినిమా పిచ్చి కుర్రాళ్ళకీ చిర పరిచితులు.

ఇంత రద్దీలోకూడా నిమ్మళంగా సీట్లో కూర్చున్న ఇద్దరువ్యక్తులు సృష్టిలో సర్వ విషయాల గురించీ చర్చించుకుంటున్నారు. ఒకతను కొత్తూరు దగ్గర ఓ పల్లె హైస్కూల్లో లెక్కల మాస్టరు. మరొకతను సమితి ఆఫీసులో గుమాస్తా. ఇద్దరూ పట్టభద్రులే. కుర్రాళ్ళే. కాని, లెక్కల మాస్టారు గానుగెద్దు లాంటి బ్రతుకు నేర్చేసుకున్నాడు. గుమాస్తా ఆలోచిస్తాడు. అంతే. ఏం చెయ్యలేడు. చెయ్యాలనీ తలంపూ లేదు.

టీచ రంటున్నాడు: "నాకు ఇంతే సుమా! శ్రీకాకుళం బయలుదేరితే సరి. ప్రతి మాస్టరూ ఒక కంప్లెయింటు పట్టుకొస్తాడు. కలెక్టరాఫీసులో పని చెబుతా డొకడు. కాలేజీలో కొడుక్కి అప్లికేషను తెమ్మంటా డొకడు. బలిగలో ఆవకాయ జాడీ ఇచ్చి రమ్మంటా డొకడు. పరిషత్‌లో బిల్లుంది—కదిలించమంటా డొకడు. వీటన్నిటి మధ్యా దూరమూ, శ్రమా వాళ్ళ కనవసరం. మిసెస్‌తో సినిమా కెళ్ళడానికే తీరిక ఉండదు. ఎవరి పని చెయ్యకపోయినా కోపా లొస్తాయి."

"ఈ సారి ఎవరికీ తెలియకుండా వచ్చెయ్యండి" అని సలహా ఇచ్చాడు గుమాస్తా.

బస్సులో రొద. వాదనలు. అర్థ నాదాలు. బూతులు. నాటు జోకులు. యుద్ధాలు. చిన్న చిన్న శృంగారపు చెళుకులు. 'ఓర్నాయినో, కాలు కుమ్మేసినావురో!' 'ఎనక నుంచి తోసేస్తన్నారు'. 'ఆడ మనిసిని కళ్ళ కనిపించవేటి?' 'డ్రైవరు సడన్ బేకేసినాడు'. 'ఏటి పిల్లా! మగోణ్ణి. కనిపించదేటి? మీద పడి పోతన్నావు'. 'సి బుర్ర పడా!' 'బాబోయ్! ఊపి రాడ్డం లేదు'. 'సిన్న పిల్ల, సచ్చిపోద్ది కుమ్మకు, నాయినా!' 'బస్సోలకి ఆ శెక్కవై పోతంది'. 'బస్సెక్కమని ఆలు మనకి బతిమాల్లేదు.'

బస్సాగింది. ఈ సారి ఆపింది రాజకీయ నాయకుడ్లా ఉన్నాడు. దొంగకి రాజు వేషం వేసినట్టున్నాడు. ఠీవిగా కనిపించడానికి ప్రతి కదలికలోనూ ప్రయత్నిస్తున్నాడు. పందెంలో ఓడినా, గెలిచినా నలుగురు ముందరా ఒకేలా నవ్వగలిగేట్టున్నాడు. వదిలేస్తే దేశాన్ని తినేసేలా ఉన్నాడు.

అతడి వెనక నలుగురు బంట్లున్నారు.

బస్సాగ్గానే కండక్టరు జనాన్ని తోసుకుని వెళ్ళి సవినయంగా మనవి చేసుకున్నాడు: "బాబూ! యమ్మెల్లే బాబూ! బస్సు గొప్ప రద్దీగా ఉన్నాది. తమలాటో లుండలేరు, బాబూ! సీటుకి ఆరుగురేసి కూకున్నారు. సూడండి, బాబూ!"

"కోర్టు పనుందయ్యా! వెళ్ళక తప్పదు."

"మీ ఇష్టం, బాబూ! దయసెయ్యండంటే" అనేసి, బస్సెక్కి, జనాన్ని కదిపి తోవచేసి, ఓ చోట ఓ అమాయకుడికి—"యమ్మెల్లేగా రొస్తన్నారు సోటిచ్చీ" అన్జెప్పి, వాణ్ణి సీటులోంచి లేపి యమ్మెల్లే గారికి సీటు చూపించి, "రండి, బాబూ!" అని మర్యాద చేశాడు.

నాయకుడి వెనక బంట్లూ కూడా బస్సెక్కారు.

యమ్మెల్లేగారు నిమ్మళంగా సర్దుకు కూర్చుని సిగరెట్టు ముట్టిస్తూ, "ఈ కూర్మాం యాత్ర బస్సులోళ్ళకీ, సినిమా వోళ్ళకీ, లాడ్జీ లోళ్ళకీ, హోటేలోళ్ళకీ వచ్చినట్టుంది" అన్నారు.

"బాగా సెల విచ్చారు, బాబూ!" అన్నాడు చెక్కరు గుర్నాథం, సృష్టి రహస్యాన్ని విన్నట్టు.

టీచరు పక్కనున్న గుమాస్తాతో అంటున్నాడు: "ఇదండీ మన దేశం. బాధ్యత గల లెజిస్లేటరు బస్సు ఓవర్ లోడ్‌లో ఉండగా మందలించడం పోయి తనూ ఎక్కి కూర్చున్నాడు. అంటే అవినీతికి ప్రభుత్వంకూడా పరోక్షంగా కారణ మవుతుందన్న మాట!"

"ఓవర్‌లోడ్ బస్సులు పట్టుకోవడానికి ఉద్యోగస్థులు వేరే ఉన్నారు కదండీ?"

"ఉండచ్చు నండీ! కాని, మందలించే బాధ్యత లెజిస్లేటరు ఇతడికి ఉండం టారా, లేదంటారా?"

"అవినీతిని మందలించే బాధ్యత ప్రతి పౌరుడికీ ఉందంటారా, లేదంటారా?"

"ఉంది."

"ఉంటే మరి మీరుకూడా బస్సు ఓవర్ లోడ్‌గా ఉన్నప్పుడే ఎక్కారు, గుర్తుందా!" అన్నాడు గుమాస్తా చిన్న చిరు నవ్వుతో. మాటలో వాడికి చిరునవ్వుతో చెప్పవలసిన అవసరం గుర్తించాడతను.


"ఔననుకోండి" అంటూ తను కూడా పెద్దగా నవ్వాడు టీచరు.

"రాజీ పడకండి, మాస్టారూ! అదే దిగజారి పోవడం. మీరు నమ్మిందీ, మీ మెదడూ, నరాలూ, అంతరాత్మ నమ్మిందీ అయిన సత్యం వేరు. మీరు చేసేది వేరు. రెంటికీ సంబంధం ఉండదు. పరిస్థితుల ఒత్తిడి వల్ల తప్పనిసరై కుటుంబం గురించీ, తన రక్షణ గురించీ చేశావని అంటే అది మోసం, దొంగతనం. రాజీ మనస్తత్వాల వల్లనే సమాజం తుప్పు పడుతుంది. సోక్రటీసు, గెలీలియో, గాంధీ, లెనిన్... ఇలా రాజీ పడి ఉంటే మన చరిత్ర ఇంకోలా ఉండేది. . ."

బస్సాగింది. టాప్ మీద ఏదో బస్తా లెక్కిస్తున్నారు. ఇలా మాటి మాటికీ గంటల తరబడీ ఆగడంతో లోన ఊపిరాడకుండా నిలుచున్న ప్రయాణికులు తిట్టుకుంటున్నారు.

యమ్మెల్యేగారు తాపీగా కండక్టరుని చూస్తూ, "నర్సయ్యా! మీ షావుకారు బావున్నాడోయ్? విజయనగరం రూటు ఒకటి సంపాదిస్తున్నాడు. మొన్న హైదరాబాదొచ్చేడ్లే. నా దగ్గిరే నాల్రోజు లున్నాడు" అన్నారు.

"ఎక్స్ప్రెస్ రూటు కావాలంటున్నారండీ" అన్నాడు నరసయ్య.

టీచ రంటున్నాడు: "చూడండీ! ప్రైవేటు బస్సు ఓనర్స్ బస్సు మీద బస్సు కొంటుంటారు. మరి ఆర్. టి. సి. వాళ్ళు నష్టాలొస్తున్నాయని గోల పెడుతుంటారు."

"ప్రైవేట్ ప్రాపర్టీ మీద ఉన్న శ్రద్ధ పబ్లిక్ ప్రాపర్టీ మీద ఉండదండీ. మన కండక్టరు నరసయ్యనే తీసుకోండి. ఆర్. టి. సి. బస్సులో వేస్తే ఇలా పని జేస్తాడా, చెప్పండి? 'నీకిష్టమైతే టిక్కెట్టు కొని బస్సెక్కు. లేకపోతే ఫో' అంటాడు. ప్రైవేట్ రంగంలో ప్రొడక్షన్ బాగా ఉంటుందండీ. ఆ విధంగా చూస్తే డెమాక్రసీ మంచిదే" అని వివరించాడు గుమాస్తా.

"కాని, అక్కడ ఆకలీ, బ్లాక్ మనీ, నరపీడనాకూడా ఉంటాయి! ఆ విధంగా చూస్తే సోషలిజం మంచిది" అని కౌంటరు విలువ చెప్పాడు టీచరు.

మళ్ళీ బస్సాగింది. ఈ సారి ఆపింది ఫ్లైంగ్ స్క్వాడ్ కాదు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టరు ఫ్యాను.

వెంట ఇన్‌స్పెక్టరుగారూ, మరో గుమాస్తా కూడా ఉన్నారు.

ఇన్‌స్పెక్టరుగారు లావుగా ఉన్నారు. ఓవర్ లోడ్ బస్సు పట్టుకుంటున్నారు. కనక కోపంగా కనిపించడానికి ప్రయత్నిస్తున్నారు. డ్యూటీకీ, సంపాదనకీ మంచి సంబంధాన్ని కనిపెట్టి, దాని తూచా తప్పకుండా ఆచరిస్తున్నారు. డబ్బు సంపాదిస్తున్న మనిషి కనక సమస్యలు లేనట్టు ప్రశాంతంగామా ఉన్నారు.

ఇన్‌స్పెక్టరు నరసింహంగారు నిన్ననే ఇక్కడ జాయినై, ఈ రోజే రూటు మీదికి బయలుదేరి ఎన్నో బస్సులు ఓవర్‌లోడ్‌గా ఉండగా ఈ బస్సునే పట్టుకోవడంలో మిస్టరీ, ఎవరికీ తెలియదు, ఫ్యాను వీరాసామికి తప్ప.

బస్సు పిల్చింది అతనీ చుట్టూ చేరారు. కండక్టరు నరసయ్యకి ఇది మొదటి అనుభవం కనక కొంచెం బెరుగ్గా కనిపిస్తున్నాడు. అయినా, పర్యవసానం తెలుసు కనక ధీమాగానే ఉన్నాడు.

"ఏమిటయ్యా ఇది...రూటు బస్సా? సిటీ బస్సా? లారీయా? ఏమిటీ లోడు? నీ ఉద్దేశ మేటి?" అని నరసింహంగారు పంజా విసిరారు.

"పొరపాటయింది, సార్" అన్నాడు చెక్కుటు గుర్నాధం, బ్రోకర్ విటుణ్ణి చూసినట్టు చూసి చొరవగా నవ్వి.

నరసయ్య మాత్రం ఏమీ అనలేక పోతున్నాడు. ఏదో ఒక గిల్టీ భావం అతన్ని క్రుంగ దీస్తూంది. మొదటిసారి దొంగతనానికి వెళ్ళినవాడూ, కాలనీకి వెళ్ళినవాడూ, సారాగ్లాసు ముట్టుకున్న వాడూ, పేకముక్క పట్టుకున్న వాడూ ఇలాగే గిల్టీగా ఉంటారు కాబోలు.

"ఏదో ఒకటీ రెండు టిక్కెట్లంటే పొరపాటు కాని, ఇంత లోడు కుక్కేసి పొరపాటంటే ఎవడు నమ్ముతాడోయ్? హుం! వీరాసామీ! టిక్కెట్లు లెక్క పెట్టవోయ్" అని వాణ్ణి బస్సు వైపుకి పంపారు. "ఎవడోయ్ కండక్టర్ నువ్వేనా! టిక్కెటు బుక్కు తే" అని నరసయ్య వైపు చూసి ఉరిమారు.

వీరాసామి బస్సు వైపు వెళ్ళాడు.

నరసయ్య బుర్ర గోక్కున్నాడు. టిక్కెట్టు బుక్కు అతడి వద్ద లేదు. ఇది గమనించాడు నరసింహంగారు.

"టిక్కెట్లు కోసివ్వడం లేదు కదూ? నీ డొక్క చీల్చేస్తానుండు" అంటున్నంతలో వీరాసామి తిరిగొచ్చి, "లెక్క పెట్టడం నా వల్ల కాదు, సార్! అందర్నీ కిందికి దించమనండి" అని విన్నవించాడు.

"అలాగా!" అని నరసింహంగారు తల తాటించారు. ఎందుకో కాని ఆయ ఏవేళ న్యాయాన్నీ, ధర్మాన్నీ ఉద్ధరించడానికి కంకణం కట్టుకుని ఓవర్‌లోడ్ చేసే దురాచారాన్ని అరి కట్టడానికి వరం పొంది వచ్చినట్టు పునీతంగా కనిపించారు. రోజూ ప్రొహిబిషన్ 'పని' మీద కంపెనీల కొచ్చే పోలీసు ఈ రోజు ప్రొహిబిషన్ 'డ్యూటీ' మీద వచ్చినట్టుంది.

"కండక్టరూ! వాళ్ళందర్నీ దించి జనాభా లెక్క చెప్పవయ్యా! వెళ్ళు, దిక్కులు చూస్తావేటి?" అని కసిరారు.

ఈ సరికి నరసయ్యకి నిజంగానే భయం వేసింది. మెల్లగా వెళ్ళి ప్రయాణీకుల్ని దించి లెక్క చెప్పాడు.

మూట ఇరవై ఆరు టిక్కెట్లు!

ట్రాఫిక్ ఇన్‌స్పెక్టరు నరసింహంగారు ముక్కు మీద వేలేసుకున్నారు. మొహం చీదరించారు. "ఎలభై రెండు సీట్ల బస్సుకి మూటా ఇరవై ఆరు టిక్కెట్లా? శభాష్!" అన్నారు.

"ఆ చెట్టు దగ్గిరికి నీడలోకి రండి, సార్! మాటాడు కుందాం" అని డ్రైవరు చొరవగా ఆహ్వానించాడు నరసింహంగారిని.

ట్రాఫిక్ ఇన్‌స్పెక్టరుగారు కోపంగానే చూశారు. రోజూ సీక్రేట్‌గా సారా కొట్టు కెళుతూ ఖాతా మొదలు పెట్టిన పెద్దమనిషి, ఆ రోజు ప్రత్యేకంగా నలుగురు మర్యాదస్థులతో కలిసి ఆ కొట్టు ముందరగా వెళుతుండగా అమ్మే ఆవిడ—'రండి, బాబూ! నిన్న రాలేదేం?' అని పిలిస్తే ఆ పెద్దమనిషి ఆమె వైపు ఎలా చూస్తాడో అలా చూశారు నరసింహంగారు. "నే నెక్కడికీ రాను. నాకు ఎండైనా ఫరవాలేదు. నా డ్యూటీ వాది. ఈ లోడేవిటి? మూటా ఇరవై ఆరు

**కొందరు మొదట కార్యాచరణకు పూనుకొంటారు. తరవాత ఆలోచనలో పడతారు. శాశ్వతంగా పశ్చాత్తాపం చెందుతారు.**

**• • •**

**వినోద విహార కార్యకలాపాలలో నిమగ్నం కావడం అంటే సోమరిగా ఉండడం కాదు; కార్యక్రమాలను మార్చడం మూలంగా అంతకు ముందు అలసట చెందిన శరీరావయవాలకు విశ్రాంతి చేకూర్చడం.**

—సి. సిమ్మన్స్

టిక్కెట్లేవిటి? ఇలా చేస్తే మీ షావుకారు మరి నలభై బస్సులు, ఏభై లారీలు కొంటాడోయ్. డబ్బే చూసుకుంటున్నాడు. మంచీ మర్యాదా మరిచి పోయాడు. . ." ఈ మాటలకి తలా తోకా అక్కడెవరికీ తెలియవు.

గుమాస్తా టిక్కెట్లు నోటు చేసుకున్నాడు.

"కండక్టరూ! నీ లైసెన్సిలాగ తే!"

నరసయ్య ఈసరికి నీరు కారి పోయాడు. ఆ గొంతులో కాఠిన్యానికి లొంగిపోతూ లైసెన్సు పుస్తకంఇచ్చేస్తూ—"సార్, సార్!" అన్నాడు ఎలాగో గొంతు పెగుల్చుకుని.

"సారూ లేదు, గీరూ లేదు" అంటూ లైసెన్సు పుస్తకాన్ని గుమాస్తా చేతికిచ్చేశారు ఇన్‌స్పెక్టరుగారు.

పసిపిల్లాడికి నీ ముక్కు కోసేస్తాను అని సరదాగా జడిపిస్తూ, నిజంగానే కోసెయ్యబోతే వాడెంత భయంగా, దీనంగా, అసహాయంగా చూస్తాడో అలా చూశాడు నరసయ్య.

నరసింహంగారు మారు మాటాడకుండా జీపెక్కారు.

డ్రైవరూ, చెక్కరూ ఎంతో బతిమాలారు. ఆయన వినలేదు. జీపు కదిలి పోయింది.

నరసయ్య మిగిలి పోయాడు. ఇదంతా అతని కో పీడ కలలా ఉంది. పర్యవసానానికి తలా తోకా అందకుండా ఉంది. అతడితో ఎన్నో ఆలోచనలు. మనసులో, శరీరంలో ఏ మూల నుంచో అస్పష్టంగా ఏదో ఏడుపు ధ్వని. ఆ ఏడుపు ఎవరిదో అతని కా సమయంలో తెలియక పోవచ్చు.

• • •

ఆ తరవాత గవర్రాజుగారు యమ్మెల్లే గార్ని పట్టుకొని నరసింహంగారికి బదిలీ చెయ్యించారు. నరసింహంగారు మినిస్టరు గార్ని పట్టుకుని బదిలీ తప్పించుకుని మళ్ళీ అక్కడికే వచ్చారు. ఈ లోగా ఎలక్షన్లొచ్చి గవర్రాజుగారి యమ్మెల్లే గారు ఓడిపోయారు. నరసింహంగారి మినిస్టరుగారు గవర్రాజుగారి రూట్లన్నీ కేన్సిలు చేసేశారు. మరెందుకని గవర్రాజు గారు కాంగ్రెసుకి బాగా విరాళా లిచ్చి రాజ్యసభ సభ్యులై, తన రూట్లు వడ్డీతో సహా తెచ్చుకున్నారు. కేంద్ర మంత్రి గార్ని పట్టుకుని నరసింహంగారు పెద్ద ప్రమోషన్ను పొందేశారు. ఓ శుభ సమయాన నరసింహంగారూ, గవర్రాజు గారూ కలిసి పెద్ద విందు చేసుకుని 'విరోధాలకి స్వస్తి' అనుకున్నారు.

• • •

ఇదంతా అందరికీ తెలిసిన పాత కథే.

కండక్టరు నరసయ్య మాత్రం రెండు బుల్‌డోజరు చక్రాల సరదా పందెంలో మధ్య పడ్డ బొమ్మ బస్సు రబ్బరు చక్రంలా అయిపోయాడు. చితక లేదు. ఎదగ లేదు. ఇక ముందెప్పుడో చితికి పోవచ్చు, లేకపోవచ్చు. ఇలాగ ఫ్లాట్ ఆఫీసర్లకి దొరకడం, తప్పించుకోవడం, దొరకడం—కాళ్ళు పట్టుకోవడం, తప్పించుకోవడం, జరిమానా కట్టడం—తప్పించుకోవడం... లైసెన్సు పుస్తకం పూర్తి రిమార్కులతో నిండి పోయింది.

ఉదయం ఏడైమకి బస్సెక్కడం, టిక్కెట్లు కొయ్యడం. ఎవరో ఇమ్మన్న సామాన్లు తేవడం, సాయంత్రం రావడం, షావుకారుకి లెక్క అప్ప చెప్పడం, ఆలస్యంగా ఇంటి కెళ్ళి డబ్బేమైనా ఉంటే భార్య చేతిలో పెట్టి ఎప్పుడైనా తాగి వెళ్ళి ఆమెని కొట్టి, మళ్ళీ చీకట్నే లేచి బస్సెక్కి ఇంజను రొదలో, జనం గోలలో గడిపి. . .

అపారమైన మేధా, జీవచైతన్యమూ కల 'మానవుడు' ఇలాగ గమ్యం లేకుండా, ఆశలూ, ఆశయాలూ లేకుండా తన చక్రం కింద మనిషి పడిపోయినా గుర్తించ లేని యంత్రం లాగా, గడియారం లాగా, బానిస లాగా జీవించకుండా బ్రతికెయ్యడం మొదలు పెడితే మానవతకి అంతకన్నా విషాదం లేదు. ఇలాగ జరగడానికి కారణాలు వెతికి, ఉదాహరణంగా నరసయ్యనే తీసుకుంటే ఎప్పుడో ఎక్కడో అతడొక తప్పటడుగు వేశాడని తెలిసి పోతుంది. అది అతడి బ్రతుకంతా వ్యాపించి పోయిందనీ అవగాహనై పోతుంది.

ఈ తెలుసుకోవడంతో మాత్రమే సరి కాదని మన కందరికీ తెలుసు. ✻